క్లుప్తంగా

లోతట్టు ప్రాంతాల పరిశీలన



వరద నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్

హుస్నాబాద్: పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాలను పరిశీలించి, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి వర్షపు నీరు నిల్వకుండా డ్రైనేజీలకు మళ్లించాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాలతో ఏమైనా ఇబ్బంది కలిగితే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ డెస్క్‌కు సమాచారం అందించాలని, వెంటనే సహాయక చర్యలు చేపడతామని కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ములుగు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్



మంత్రితో కలిసి కేక్ కట్ చేస్తున్న రంగారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ములుగు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి హరీశ్‌రావు నివాసంలో కలిసి మంత్రికి పుష్పగుచ్ఛం అందించి ఆశీస్సులు తీసుకున్నారు. అక్కడే కేక్ కట్ చేసి, శాలువా కప్పి మంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎంపీపీ బాలేషంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మదాసు శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రంగారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాల నిధులపై ఆడిట్

రాయపోలు(దుబ్బాక): గత సంవత్సరం విడుదలైన పాఠశాల అభివృద్ధి నిధులపై అధికారులు ఆడిట్ నిర్వహించారు. దౌల్తాబాద్ మండలంలోని 35 ప్రభుత్వ పాఠశాలలతో పాటు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాలలకు గతేడాది విడుదలైన పాఠశాలల అభివృద్ధి నిధులు, వినియోగం తదితర అంశాలపై దౌల్తాబాద్‌లోని మండల వనరుల కేంద్రంలో మంగళవారం ఆడిట్ చేశారు. నిధుల నిర్వహణ వివరాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఆడిటర్ సురేశ్‌బాబు, ఎంఈఓ నర్సమ్మ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గజ్వేల్ సీఐగా జాన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



సీపీ శ్వేతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ జాన్‌రెడ్డి

గజ్వేల్: గజ్వేల్ నూతన సీఐగా జాన్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిద్దిపేట సీపీ శ్వేతను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. జాన్‌రెడ్డి నిజామాబాద్ జిల్లా కమిషనరేట్ పరిధిలోని రుద్రూర్ సీఐగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చిన సంగతి తెలిసిందే.

శిథిల ఇళ్లల్లో ఉండొద్దు



కాలనీ వాసులకు సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: భారీ వర్షాలు కురుస్తున్నందున ఎవరూ కూడా శిథిల ఇళ్లల్లో ఉండకూడదని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డులో ఆమె పర్యటించి పురాతన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలతో శిథిల ఇళ్లు కూలిపోయే ప్రమాదముందని తెలిపారు. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే తనకు ఫోన్ చేయాలని చైర్‌పర్సన్ రజిత సూచించారు. అదేవిధంగా 5వ వార్డులో మురికి కాల్వల్లో ఉన్న చెత్తా, చెదారాన్ని సిబ్బందితో తొలగింపజేశారు. ఆమె వెంట కౌన్సిలర్ భాగ్యరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

దంచికొట్టిన వాన

- ఏకధాటిగా కురుస్తున్న వర్షం
- నిండుకుండలా చెరువులు, కుండలు
- నీటమునిగిన పంటలు

జిల్లాలో వర్షాల జోరు తగ్గడం లేదు. సోమవారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం మంగళవారం రాత్రి వరకు కురుస్తూనే ఉంది. పాఠశాలలకు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, వాహనదారులు తిరుగు ప్రయాణంలో తడుస్తూ వెళ్లాల్సి వస్తోంది. వర్షం కారణంగా చిరు వ్యాపారులు, రోజువారీ కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



హుస్నాబాద్‌రూరల్: అలుగు పారుతున్న పొట్లపల్లి చెక్‌డ్యామ్

హుస్నాబాద్‌రూరల్: వర్షాలకు చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంది. మంగళవారం వరదల తీవ్రత పెరగడంతో పొట్లపల్లిలో వరి పంటలు నీట మునిగాయి. వాగులోకి నీళ్లు వెళ్లే చోట చిన్న కల్వర్టు నిర్మించడంతో పంట పొలాల్లోకి వరదనీరు చేరుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లి, జనగామ, అక్కన్నపేట, అంతక్కపేట గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని పంట పొలాలన్నీ జలమయమయ్యాయి. అక్కన్నపేట, మల్లంపల్లి గ్రామాల్లోని చెరువులు నిండుకుండలా మారాయి. దీంతో అక్కడక్కడా చిన్న వంకలు, చెరువు కుంటల్లో చేపలు పట్టేందుకు పోటీపడుతున్నారు.

కోహెడ(హుస్నాబాద్): కోహెడలో కురిసిన భారీ వర్షానికి వరి, పత్తి పంటలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతంలో నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో పంటలు దెబ్బతిన్నాయి. కోహెడ బాడుగుల చెరువుకు వరదనీరు ప్రవహించే కాల్వకు గండి పడటంతో పంటలు నీట మునిగాయి.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు చెరువులు, కుంటలు నిండి జలకళ సంతరించుకుంటున్నాయి. కల్వర్టులు, లోతట్టు ప్రాంతంలో ఉన్న పంట పొలాలకు వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. మంగళవారం కల్లెపెల్లి గ్రామంలోని నాగులచెరువు, బేగంపేట కొత్త, పాత చెరువులు మత్తెడ పోశాయి. కల్లెపెల్లి నాగుల చెరువును మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సందర్శించారు. మత్తెడలో చేపలు పడుతున్న జాలరులతో మాట్లాడారు. వలలో చేపలు పట్టి సందడి చేశారు.

రాకపోకలు బంద్

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ గ్రామం వద్ద ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో హన్మకొండ-సిద్దిపేట ప్రధాన రహదారి లోలెవల్ వంతెనపై నుంచి మరోసారి వరదనీరు వెళ్లడంతో మోయతుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు ఉధృతంగా ప్రవహించడంతో బస్వాపూర్ వద్ద వాహనాలు వెళ్లకుండా ముందు జాగ్రత్తగా రాకపోకలు నిలిపివేశారు.

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి నుంచి ఎల్లంపల్లె, లక్ష్మీపూర్ గ్రామాల మధ్య రోడ్డు, గూడెం కల్లెపెల్లి గ్రామాల మధ్య నిర్మించిన మట్టి రోడ్డు సోమవారం రాత్రి కురిసిన వర్షానికి గండి పండి రాకపోకలు నిలిచిపోయాయి. బెజ్జంకి నుంచి బేగంపేట మీదుగా లక్ష్మీపూర్‌కు ఉన్న ప్రధాన రహదారిపై కంకర పోసి పనులు నిలిపివేయడంతో వాహనదారులు అంతర్గత రోడ్డు నుంచి వెళ్తున్నారు. వెంటనే గండ్లను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.



కోహెడ(హుస్నాబాద్): నీటమునిగిన పత్తిపంట



బెజ్జంకి(సిద్దిపేట): గండిపడ్డ బెజ్జంకి-లక్ష్మీపూర్ రోడ్డు



అక్కన్నపేట(హుస్నాబాద్): జనగామలో నీట మునిగిన వరి పంట



కోహెడరూరల్(హుస్నాబాద్): వంతెనపై నుంచి వెళ్తున్న నీరు



బెజ్జంకి(సిద్దిపేట): కల్లెపెల్లి నాగుల చెరువులో చేపలు పడుతున్న ఎమ్మెల్యే రసమయి, యువకులు

రథయాత్రను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

గజ్వేల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో టీఎస్‌సీపీఎస్‌ఈయూ(తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఈ నెల 28న గజ్వేల్‌కు చేరుకోనుందని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు తెలిపారు. మంగళవారం సంకల్ప యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గజ్వేల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ అనేది ప్రభుత్వ ఉద్యోగికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని చెప్పారు. కానీ సీపీఎస్ విధానం పేరుతో ఉద్యోగుల సొమ్మును షేర్ మార్కెట్‌లో పెట్టడంతో ఉద్యోగులకు పెన్షన్ గ్యారంటీ లేదని చెప్పారు. సీఎం స్పందించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో 28న చేపట్టనున్న సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు షేక్ బిలాల్, ప్రవీణ్, సౌజన్య, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): పేద ప్రజలకు లబ్ధి చేకూర్చడానికే సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ నుంచి మంజూరైన ఆటోను మండలంలోని పెరుబండకు చెందిన సురేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.


రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న క్లబ్ గవర్నర్

ములుగు(గజ్వేల్): ఏళ్ల చరిత్ర కలిగిన రోటరీ క్లబ్ సామాజిక అంశాలపై చేస్తున్న సేవలు అభినందనీయమని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్(3150) బుసిరెడ్డి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ములుగులోని కేఎమ్ఆర్ గార్డెన్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన గజ్వేల్ రోటరీ క్లబ్ 14వ వార్షికోత్సవ నూతన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రోటరీ సేవలు మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి మరిన్ని కార్యక్రమాలను చేపట్టి గజ్వేల్ రోటరీ క్లబ్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. క్లబ్‌కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్, కార్యదర్శి ఎస్.నర్సింహ్మారెడ్డి, కోశాధికారి ఎం.శ్రీనివాస్‌గౌడ్, సభ్యులతో గవర్నర్ శంకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ హరిశంకర్, మాజీ అసిస్టెంట్ గవర్నర్ కర్ణాకర్‌రెడ్డి, క్లబ్ మాజీ అధ్యక్షులు బాపురెడ్డి, పురుషోత్తం, చంటి, జగదీశ్వర్, నర్సింహారెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



భాస్కర్‌రెడ్డికి కండువా కప్పుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాన్గల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మాధవరెడ్డి గారి భాస్కర్‌రెడ్డి మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు ఎంపీ పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, నాయకులు ఐలయ్య, లక్ష్మారెడ్డి, శరత్ పాల్గొన్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ నాయకులు ఆలేటి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మద్దూరు మండలంలోని లద్నూరు గ్రామంలో అఖిలపక్ష జేఏసీ రెవెన్యూ డివిజన్ మద్దూరు మండల నాయకుడు రామడుగు బాల్‌రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గణనీయమైన పాత్ర పోషించిందన్నారు. మద్దూరు మండల ప్రజలు హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్‌కు వెళ్లాలంటే 45 కిమీ దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా మండలంలోని ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, విద్యావంతులు, మహిళలు, యువకులు, విద్యార్థులు రాజకీయాలకు అతీతంగా చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూల శరత్, వైస్ చైర్మన్‌గా మచ్చ ఉపేందర్, జీడికంటి కుమార్, ప్రధాన కార్యదర్శిగా బొంగొని బాలు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జేఏసీ మండల నాయకులు రాపాక బుచ్చిరెడ్డి, జీడికంటి సురేశ్ పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్



హుస్నాబాద్‌లో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హుస్నాబాద్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు పూర్తిగా రక్షణ కరువైందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్య ఘటనలకు కారకులైన వారిని గుర్తించి బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన మణిపూర్ రాష్ట్ర సీఎం బీరన్‌సింగ్‌ను తక్షణమే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొమ్ముల భాస్కర్, ముంజ గోపి, రజని, పద్మ, జనార్దన్, సంజీవరెడ్డి, మంద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మణిపూర్ ఘటనకు మండల కేంద్రంలో రైతు సంఘం, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఐద్వా, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సనాది భాస్కర్, ఐద్వా జిల్లా కార్యదర్శి అత్తిని శారద, అయినాపూర్, రాంసాగర్ సర్పంచ్‌లు చెరుకు రమణారెడ్డి, తాడూరి రవీందర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బక్కెల్లి బాలకిషన్, సీఐటీయూ నాయకులు ఆరుట్ల రవీందర్, మల్లేశం, ఎల్లయ్య, యాదయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో గల అంబేడ్కర్ చౌరస్తా వద్ద మణిపూర్ ఘటనకు నిరసనగా సీఐటీయూ నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బాల్ నర్సయ్య, కొమురయ్య, శ్రీనివాస్, నర్సింలు, ఐలయ్య, చంద్రయ్య, లక్ష్మణ్, ఆంజనేయులు, భిక్షపతి, లింగం, సాయికుమార్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత



ఓ ఇంట్లో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న చైర్‌పర్సన్ వనిత, తదితరులు

దుబ్బాకటౌన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా రోగాలు దరిచేరవని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి వార్డులో వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణబాలకిషన్‌గౌడ్, కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి, కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో మురికి నీరు, చెత్త చెదారం లేకుండా ప్రజలు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తదితరులు ఉన్నారు.

ఉన్నత విద్యకు చేయూత



మానసకు ల్యాప్‌టాప్ అందిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: పేద విద్యార్థుల ఉన్నత విద్యకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఐఐటీ కాన్పూర్‌లో సీటు సాధించిన దుబ్బాక మండలం అచ్చుమాయపల్లికి చెందిన చింతల మానసకు ఎమ్మెల్యే ల్యాప్‌టాప్ అందించారు. చదువుతోనే పేదరికం దూరం అవుతుందని పిల్లలను తల్లిదండ్రులు బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, బీజేపీ నాయకులు మంద అనిల్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, చింత సంతోష్, సుంకోజి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



హుస్నాబాద్: క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

హుస్నాబాద్: ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న వీఆర్ఏల కల సాకారమైన వేళ వీఆర్ఏలు సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చిన సందర్భంగా మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్ కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు తాము ఎల్లవేళలా రుణపడి ఉంటామని వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం జిల్లా కో-కన్వీనర్ మాచర్ల భవానీ, మండల అధ్యక్షుడు నీరటి వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు బోజు ప్రసాద్, నాయకులు లింగరాజు, పద్మ, జ్యోతి, తిరుమల, మహేందర్, శ్రీనాథ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

చేర్యాల(సిద్దిపేట): సీఎం కేసీఆర్ చిత్రపటానికి పట్టణ కేంద్రంలో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూళ్మిట్ట మండలాలకు చెందిన వీఆర్ఏలు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు కరుణాకర్, రాజలింగం, సుజాత, సురేశ్, కరుణాకర్, మహేందర్, పరశురాములు, బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల బాలయ్య మాట్లాడుతూ.. తమను శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీఓ విడుదల చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, వీఆర్ఏలు శ్రీశైలం, జమున, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాయపోలు(దుబ్బాక): మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో మంగళవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు నీరుడి యాదగిరి, నాయకులు మమత, మేకల శ్రీనివాస్, భాగ్యశ్రీ, కనకరాజు, నగేశ్, బాలమణి, రజిత తదితరులున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మిరుదొడ్డి తహసీల్దార్ ఉదయశ్రీకి వినతిపత్రం అందిస్తున్న తపస్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి సింగోజీ జనార్దన్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తపస్ ఆధ్వర్యంలో మిరుదొడ్డి తహసీల్దార్ ఉదయశ్రీకి మంగళవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా కార్యదర్శి లోకేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): సమస్యల పరిష్కారం కోసం తపస్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ రామేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, మల్లికార్జున్, గోపాల్‌రెడ్డి, పరశురాములు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎల్‌ఓసీ అందజేత

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన నందనబోయిన శ్రీహరికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2లక్ష ఎల్‌ఓసీ పత్రాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కిరణ్ కుమార్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింలు, బీఆర్ఎస్ నాయకులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

◆ ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐ సుహాసిని అన్నారు. అక్కన్నపేట మండలం పోలింగ్ కేంద్రం 66, కేశనాయక్ తండా 45, ముబ్బుకుంట పోలింగ్ కేంద్రాల్లోని ప్రజలకు ఈవీఎం మిషన్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్స్‌ల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కరీం, కేశనాయక్‌తండా ఉపసర్పంచ్ భాస్కర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ పుస్తకాల వితరణ

హుస్నాబాద్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని గ్రంథాలయానికి పాఠశాల పూర్వ విద్యార్థి, కవి వేముల తిరుపతిరెడ్డి మంగళవారం పుస్తకాలు వితరణ చేశారు. విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా గ్రంథాలయానికి 200 పుస్తకాలు అందజేశారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి తిరుపతిరెడ్డికి హెచ్‌ఎం బండారి మనీల, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.

◆ సన్మానం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ నుంచి బదిలీపై వెళ్తున్న సీఐ వీరప్రసాద్‌తో పాటు ఇక్కడికి బదిలీపై వచ్చిన సీఐ జాన్‌రెడ్డిలను పలువురు సర్పంచ్‌లు సన్మానించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అక్కారం, కోమటిబండ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు బాల్‌చంద్రం, తూం శేఖర్‌లతో పాటు నాయకులు మన్నె అశోక్, పాండులు సీఐలకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

◆ యువకులకు లెర్నింగ్ లైసెన్స్‌లు

దుబ్బాక: ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఉచిత లైసెన్స్‌లకు స్లాట్‌బుక్ చేసుకున్న 180 మంది యువకులకు మంగళవారం సిద్దిపేట ఆర్టీఓ కార్యాలయంలో లెర్నింగ్ లైసెన్స్‌లను బీఆర్ఎస్ నాయకులు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, ఈర్షద్ హుస్సేన్, జగన్‌గౌడ్ ఉన్నారు.

◆ రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): ఈ నెల 30లోపు రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి, బెక్కల్ గ్రామాల్లో రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈఓ అనూష, కల్పనలు ఉన్నారు.

◆ కొమురవెల్లిలో కళాశాల ఏర్పాటు చేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఎనిమిది రోజులుగా చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం కొమురవెల్లికి చేరుకోవడంతో ప్రజా సంఘాలు స్వాగతం పలికారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అరవింద్, ఉపాధ్యక్షులు సంజీవ్, రంజిత్‌రెడ్డి, నాచారం శేఖర్ పాల్గొన్నారు.

◆ జీఓ 81ని రద్దు చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): వంతుల వారీగా విధులు నిర్వర్తించే వీఆర్ఏలకు గుదిబండగా మారిన జీఓ 81ని వెంటనే రద్దు చేయాలని వీఆర్ఏలు డిమాండ్ చేశారు. వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేయడాన్ని నిరసిస్తూ వంతుల వారీగా పనులు నిర్వహిస్తున్న వీఆర్ఏలు మంగళవారం మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. జీఓ 81ని రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్ ఉదయశ్రీకి వినతిపత్రం అందించారు. అసలు దారులు వీఆర్ఏలుగా ఉద్యోగం పొందితే తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమపై దృష్టి సారించి ఉద్యోగ మార్గం చూపాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిధిలోని వంతుల వారి వీఆర్ఏలు నర్సింహులు, నాగరాజు, ప్రశాంత్, సాగర్, ఎల్లం, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ తహసీల్దార్‌ను కలిసిన విద్యుత్ ఏఈ

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల విద్యుత్ ఏఈగా తాళ్ల రాజేంద్రప్రసాద్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్ ఆశాజ్యోతిని, స్థానిక సర్పంచ్ పాల్కంపల్లి జయంతిలను మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు పాల్కంపల్లి నరేందర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు అజీమొద్దిన్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990